ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలి

వికారాబాద్, జనవరి 18 : 1 జనవరి, 2024 నాటికి 18 ఏండ్లు పూర్తి చేసుకున్నవారందరూ ఓటరు జాబితాలో తప్పనిసరిగా తమ పేరును నమోదు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి నారాయణరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20, 21 తేదీల్లో స్పెషల్ క్యాంపైన్ డే నిర్వహించడం జరుగుతుందన్నారు. 1 జనవరి 2024 నాటికి 18 ఏండ్లు పూర్తి చేసుకున్న యువత తప్పకుండా తమ పేర్లను ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. బూత్ స్థాయి అధికారులు సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో ముసాయిదా ఓటరు జాబితా, సంబంధిత ఫారాలు 6, 7, 8లతో ఉదయం 10 గంటల నుంచి అందుబాటులో ఉంటారన్నారు. ఓటరు జాబితాలో పేరు నమోదుతో పాటు సవరణలు, చిరునామా మార్పులు చేర్పులతో పాటు ఇతర క్లెయిములు, అభ్యంతరాలపై దరఖాస్తులు స్వీకరించనున్నామని నారాయణరెడ్డి తెలిపారు.

మెరుగైన సేవలు అందిస్తాం

డీటీసీ ప్రవీణ్‌రావు

తుర్కయాంజాల్, జనవరి 18 : తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని మన్నెగూడలో నిర్మించిన ఇబ్రహీంపట్నం ఆర్టీవో కార్యాలయ నూతన భవనాన్ని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ప్రవీణ్‌రావు మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన రవాణా సేవలు అందించడానికి అధునిక వసతులు, సౌకర్యాలతో నూతన కార్యాలయాన్ని నిర్మించినట్లు తెలిపారు. రామోజీ ఫౌండేషన్ సహాయంతో రూ.2కోట్ల15లక్షలతో భవన నిర్మాణం చేపట్టామన్నారు. కంప్యూటర్లు, ఇతర సామగ్రి కోసం రూ.28 లక్షలను అందిస్తామని తెలిపారు. రవాణా శాఖ కార్యాలయాల్లో ఇబ్రహీంపట్నం కార్యాలయం నుంచి అత్యధికంగా ప్రభుత్వానికి ఆదాయం చేకూరుతున్నదని చెప్పారు. గత సంవత్సరం రవాణా శాఖ ద్వారా రూ.1526 కోట్ల ఆదాయం చేకూరగా.. రాబోయే సంవత్సరానికి ఆదాయాన్ని రూ.1700 కోట్లు చేస్తామని పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సేవలను అందించడానికి రవాణా శాఖ సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు.

పెట్స్.. వీ మిస్..!

- కుటుంబంలో ఒకరిగా మారిన పెంపుడు జంతువులు
- వాటి మరణంతో యజమానుల దిగ్భ్రాంతి
- ఆ లోటును తీర్చుకునేందుకు కొత్త ఆలోచనలు
- కొందరు వీధి కుక్కలకు ఆహారం వేస్తూ ముందుకు..
- మరికొందరు కొత్త శునకాలను పెంచేందుకు ఆసక్తి

అంబర్‌పేటకు చెందిన లలిత. ఆమెకు పెంపుడు కుక్క (టఫీ) అంటే ప్రాణం. ఎప్పుడయినా ఒకరోజు బయటకు వెళ్లాల్సి వస్తే.. కూతురుకు ఫోన్ చేసి పిల్లల కంటే ముందే 'బఫీ బాగుందా.. మంచిగ తింటుందా?' అని వాకబు చేసేంత ఇష్టం. 14 ఏండ్లకు బఫీ కన్ను మూసింది. ఆమెనోదార్చడం ఎవరి వల్లా కాలేదు.

స్వప్నకు కుక్కలంటే ఇష్టం. సొంత కుటుంబ సభ్యుల్లా కుక్క(సోఫీ)ని చూసుకునేది. ఒక్కసారిగా సోఫీ అనారోగ్యం బారిన పడింది. దవాఖానల చుట్టూ తిప్పినా ఫలితం దక్కలేదు. కండ్ల ముందే సోఫీ కన్నుమూసింది.. ఇది జరిగి ఏడాదయింది.. ఆ బాధను ఆమె ఇప్పటికీ దిగమింగలేకపోతున్నది.

ఇలా ఒక్కరేంటి.. పెంపుడు జంతువులను సొంత పిల్లల్లా పెంచుకుంటున్న యజమానులు అవి ఇక తమతో లేవన్న సత్యాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. 'అయ్యో.. మమ్మల్ని నిద్రపుచ్చి.. రాత్రంతా కాపలా కాసే కండ్ల ముందు ఆడే శునకాలు లేకపోతే ఎట్లా!' అంటూ కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. వాటినే తలచుకుంటూ కుమిలిపోతున్నారు. కొందరు ప్రత్యామ్నాయ ఆలోచనలు చేస్తుండగా.. మరికొందరు ఆ ప్రేమను ఎప్పటికీ గుండెల్లోనే పెట్టుకుంటామని చెప్తున్నారు. 'వీ.. మిస్ సో మచ్' అంటూ బాధపడుతున్నారు.

- పెద్దఅంబర్‌పేట, జనవరి 18

వీధి కుక్కలకు ఆహారం..

ఏండ్లపాటు పెంచుకున్న శునకాలను యజమానులు కుటుంబసభ్యుల్లో ఒకరిగా చూసుకుంటున్నారు. వాటి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. చలికాలం, ఎండాకాలం, వర్షాకాలాల్లో వాటికి కల్పిస్తున్న వసతులు అనేకం. వాటికి అందిస్తున్న భోజనమూ ప్రత్యేకమే. ఇలా వారితో సమానంగా చూసుకుంటున్న శునకాలు ఒక్కసారిగా తమ కండ్ల ముందు కనిపించకపోవడాన్ని చాలా మంది జీర్ణించుకోలేక పోతున్నారు. 'మరోసారి పెంచొద్దు.. ఆ బాధను పడొద్దు' అని అతి కొద్ది మంది మాత్రమే అంటుండగా.. ఆ బాధ నుంచి బయటపడేందుకు మరో శునకాన్ని పెంచుకుంటున్నవారే ఎక్కువ. అదే పేరు పెట్టుకుని కొందరు, దాని సంతానమే అనుకుని ఇంకొందరు ప్రేమగా చూసుకుంటున్నారు. మరికొందరు మాత్రం ఏదీ ఆకలితో అలమటించకూడదనే ఆలోచనతో.. వీధి కుక్కలకు ఆహారం వేస్తున్నారు. 'నా పెంపుడు కుక్క చనిపోయింది. అదంటే నాకు చాలా ఇష్టం. ఇప్పుడది మా ముందు లేదు. మరొకటి తెచ్చుకోలేదు. ఆహారాన్ని వీధి కుక్కలకు వేస్తున్నా. వాటిలోనే ఆనందం పొందుతున్నా' అని స్వప్న అనే మహిళ పేర్కొన్నారు. 'నిత్యం మా ఇంటి సభ్యులతోపాటే వీధి కుక్కల కోసం కూడా ఎక్కువ బియ్యమే పెడతా. నేను తిన్నాక.. వాటికి కూడా వేస్తా' అని లలిత అనే మహిళ చెప్తున్నారు. అందులోనే ఆనందం ఉన్నదంటున్నారు.

ఎదురొచ్చే ఆనందం మిస్ అయ్యాం..

యజమానులు బయట నుంచి ఇంట్లోకి రాగానే పెంపుడు జంతువులు ఎదురొస్తాయి. సంతోషంగా మీదకొస్తాయి. మనల్ని చూసిన ఆనందాన్ని ఆ రూపంలో బయటపెడతాయి. 'మేం బయటకెళ్లి రాగానే.. ఎదురొచ్చే ఆనందాన్ని శునకం(లియో)ను' మిస్ అయ్యామని రోహిత్ అనే యువకుడు అంటున్నాడు. చివరి క్షణం వరకు లియోను బతికించుకునేందుకు ప్రయత్నించినా, చివరి శ్వాస తన చేతిలోనే విడిచిందని బాధ వ్యక్తం చేశాడు. పెంపుడు జంతువుల అంతిమ క్రియలను సైతం శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు కొందరు ఆసక్తి చూపుతున్నారు. శ్మశానవాటికల్లో కొందరు, సొంత తోటల్లో కొందరు పూడ్చుతున్నారు.

కన్నీటితో నివాళి అర్పిస్తున్నారు. వాటి జ్ఞాపకాలను స్మరించుకుంటూ కుమిలిపోతున్నారు. ఇంట్లో నిత్యం ఉండే మనిషి మన మధ్య లేకపోతే ఎలా ఉంటుందో... పెంపుడు జంతువు లేకపోయినా అలాగే ఉంటుందని పలువురు జంతు ప్రేమికులు చెప్తున్నారు. పెంపుడు జంతువులను కోల్పోయిన యజమానులు ఆ ప్రేమను వేరే పెంపుడు జంతువులపై చూపాలని సూచిస్తున్నారు. మరో శునకాన్ని పెంచుకోవడం ద్వారా ఆ ప్రేమను పంచాలని సూచనలు చేస్తున్నారు.

గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

వికారాబాద్ కలెక్టర్ సి.నారాయణరెడ్డి

వికారాబాద్, జనవరి 18 : ఈ నెల 26న నిర్వహించే గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. గురువారం గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై జిల్లా అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే గణతంత్ర దినోత్సవ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేపట్టాలని, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై శకటాలు, స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. వివిధ శాఖల ద్వారా లబ్ధిదారులకు అందించే అసెట్స్ పంపిణీతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమానికి ప్రొటోకాల్ ప్రకారంగా అందరినీ ఆహ్వానించాలన్నారు. ఉత్తమ సేవలందించిన అధికారులు, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేసేందుకు జాబితాను అందజేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, వికారాబాద్ ఆర్డీవో విజయకుమారి పాల్గొన్నారు.

పంటల వివరాలు నమోదు చేసుకోవాలి

- వికారాబాద్ జిల్లా వ్యవసాయాధికారి గోపాల్
- చౌడాపూర్ మండలం కొత్తపల్లిలో యాసంగి పంటల పరిశీలన



కొత్తపల్లిలో యాసంగి పంటలను పరిశీలిస్తున్న వికారాబాద్ జిల్లా వ్యవసాయాధికారి గోపాల్

కులకచర్ల, జనవరి 18 : రైతులు యాసంగిలో వేస్తున్న పంటల వివరాలను వ్యవసాయ విస్తరణాధికారుల వద్ద నమోదు చేయించాలని వికారాబాద్ జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ అన్నారు. గురువారం చౌడాపూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో యాసంగి పంటలను పరిశీలించి రైతులకు పంటలపై సూచనలు ఇచ్చారు. రైతులు యాసంగిలో వేస్తున్న పంటల వివరాలను తప్పని సరిగా ఏఈవోల వద్ద ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని సూచించారు. దీని ద్వారా పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. సిల్క్ ఫార్మింగ్ చేస్తున్న కొత్తపల్లి గ్రామానికి చెందిన గోపాల్ మల్బరీ తోటను పరిశీలించి సూచనలు ఇచ్చారు. వరి పంటలో మొగి పురుగు, చీడపురుగులు తగులకుండా ముందు జాగ్రత్తగా వరి నాడు మడుల్లో తగినంత కార్బోఫ్యూరాన్ గుళికలు చల్లుకోవాలని సూచించారు. చలి తీవ్రత నుంచి వరి నారును కాపాడుకోవడానికి మడుల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యవసాయాధికారుల సూచనల మేరకు భూములకు అనుగుణంగా పంటలు వేసుకోవాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు విశ్వనాథ్, భావన, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భారీ వాహనాలకు ఈ సమయంలో అనుమతి లేదు

- ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే చర్యలు తప్పవు
- పాదచారులు ఫుట్‌పాత్, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలను వినియోగించుకోవాలి
- ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్‌రావు

సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ శ్రీనివాసరావు

సిటీబ్యూరో, జనవరి 18 (నమస్తే తెలంగాణ): సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకుని భారీ వాహనాలపై ఆంక్షలు విధించడంతో పాటు కొన్ని ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేయనున్నట్లు ట్రాఫిక్ డీసీపీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు గురువారం గచ్చిబౌలిలోని ట్రాఫిక్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాహనదారులు, ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందుల నుంచి ఉపశమనం కలిగించేందుకే కొన్ని రకాల ఆంక్షలు, నిబంధనలను అమలు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా భారీ వాహనాల రాకపోకలపై పలు ఆంక్షలు విధిస్తున్నట్లు తెలిపారు.

ఆంక్షలు

- భారీ వాహనాలు, మధ్య స్థాయి వాహనాలు(డీసీఎం, వాటర్ ట్యాంకర్స్, ఆర్ఎంసీ, జేసీబీ, ట్రాక్టర్) వంటి వాహనాలకు ఉదయం 7.30 గంటల నుంచి 11.30 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు నిషేధం విధించారు.
- కన్‌స్ట్రక్షన్ అండ్ డెమాలిషన్ తదితర వాహనాలకు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు రోడ్లపై నిషేధం విధించారు.
- అన్ని రకాల భారీ గూడ్స్, నెమ్మదిగా కదిలే వాహనాలకు ఫ్లైఓవర్లపై నిషేధం విధించారు.
- నిషేధిత సమయాలలో పైన పేర్కొన్న వాహనాలు రాకపోకలు సాగిస్తే ఎంవీ చట్టం ప్రకారం మొదటిసారి జరిమానా విధిస్తామని, రెండవసారి ఉల్లంఘనకు పాల్పడితే వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని డీసీపీ హెచ్చరించారు.
- మల్టీప్లెక్స్ థియేటర్, ఇతర వ్యాపార భవనాల నిర్వాహకులు సరైన పార్కింగ్ స్థలం లేకుండా వాహనాలను రోడ్లపై నిలిపితే వారికి నోటీసులు జారీ చేయడంతో పాటు తగిన చర్యలు తీసుకుంటామన్నారు.
- పాదాచారులు రోడ్డు ప్రమాదాలబారిన పడకుండా కమిషనరేట్ పరిధిలో మొత్తం 55 పెలికాన్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేశామని, వీటితో పాటు రోడ్లకు ఇరువైపుల ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లను, పెద్ద పెద్ద జంక్షన్‌ల వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను పాదాచారులు విని యోగించుకోవాలని సూచించారు.
- ఆటోడ్రైవర్లు, క్యాబ్‌డ్రైవర్లు, ఇతర వాహనాలు నడిపే డ్రైవర్లు ఖచ్చితంగా యూనిఫామ్‌లు ధరించాలి.
- రాంగ్‌రూట్‌లో వాహనాలు నడిపి యాక్సిడెంట్‌లకు కారణమైతే సెక్షన్ 304కింద కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.
- ఫుట్‌పాత్‌ను ఆక్రమించిన వ్యాపారులు, ఇతరులపై చట్టప్రకారం చర్యలు తప్పవని డీసీపీ హెచ్చరించారు.

ఫెర్టిలైజర్స్ షాప్‌లో స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారిణి గీత, ఏవో అరుణకుమారి

ఈ-పాస్‌తో మాత్రమే ఎరువులు విక్రయించాలి

రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారిణి గీత

ఆమనగల్లు, జనవరి 18 : వ్యాపారులు ఈ-పాస్ ద్వారా మాత్రమే ఎరువులను విక్రయించాలని రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారిణి గీత తెలిపారు. గురువారం ఆమనగల్లులోని పలు ఫెర్టిలైజర్ షాపులను మండల వ్యవసాయ అధికారిణులు గీత, అరుణకుమారితో కలిసి తనిఖీ చేశారు. షాపుల్లో ఎరువుల నిలువలు ఈ-పాస్ ఆధారంగా ఉన్నాయా లేదా అని అమె చెక్ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి ఎరువు బస్తాను ఈ-పాస్ మిషన్ ద్వారా మాత్రమే విక్రయించాలన్నారు. ఈ మిషన్‌లో ఉన్న బ్యాలెన్స్ ఎరువుల వివరాల ప్రకారం షాప్‌లో ఉండాలని, ప్రతి రోజూ అమ్మిన ఎరువులను స్టాక్స్ నుంచి తీసివేయాలని, కొత్తగా వచ్చిన ఎరువులను ఈ-పాస్‌లో నమోదు చేయాలని ఆమె సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎరువులను విక్రయించాలని లేకపోతే సంబంధిత డీలర్స్‌పై చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో డీలర్లు సురేశ్, జంగయ్య, భరత్, రవి, శివకుమార్ ఉన్నారు.



బాధితులకు రూ.40 లక్షల చెక్కును అందజేస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్

కండక్టర్ కుటుంబానికి రూ.40 లక్షల చెక్కు అందజేత

తాండూరు రూరల్, జనవరి 18 : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాన్ని ఆర్టీసీ ఆదుకున్నదని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కండక్టర్ లక్ష్మణ్ కుటుంబ సభ్యులకు ఎండీ సజ్జనార్ రూ.40 లక్షల చెక్కును హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాండూరు డిపోకు చెందిన కండక్టర్ లక్ష్మణ్ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్‌కు వెళుతుండగా, రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడన్నారు. ఆ కుటుంబం రోడ్డుపాలుకాకుండా ఆర్టీసీ సంస్థ యాబీఐ సూపర్ శాలరీ సేవింగ్ అకౌంట్ కింద రూ.40 లక్షల చెక్కును భార్య జ్యోతి, కుమారుడు అనిల్‌కుమార్‌కు అందజేశామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ ఈడీ కృష్ణకాంత్, ఫైనాన్స్ అడ్వైజర్ విజయపుష్ప, సీపీఎం ఉపాదేవి, యూబీఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లు, బ్రాంచి మేనేజర్ అరుణ్‌కుమార్, ఆర్ఎం రాజు, డీఎం సమత ఉన్నారు.

'చన్‌వెల్లి' సందర్శన



అధికారులతో కలిసి పాలీహౌస్‌ను పరిశీలిస్తున్న విద్యార్థులు

చేవెళ్ల రూరల్, జనవరి 18 : ఎన్ఐఆర్‌డీ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్) వన్‌డే స్టడీ టూర్‌లో భాగంగా రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల పరిధిలోని చన్‌వెల్లి గ్రామాన్ని సెంటర్ ఫర్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ అండ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ అకాడమిక్ అసోసియేట్ ఉదయ భాస్కర్‌రెడ్డి, డిజైనింగ్ లైవ్‌లీ హుడ్ ఇంటర్ వెన్షన్స్ కోర్సులకు చెందిన ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వారికి మండల వ్యవసాయ అధికారి తులసి గ్రామంలో రైతులు పండిస్తున్న వివిధ రకాల పంటలు, పందిరి బీర, మల్చింగ్, పాలీహౌస్‌లను చూపించారు. అనంతరం ఒక్కో విద్యార్థి 20 కుటుంబాల చొప్పున గ్రామంలోని ప్రజల జీవన విధానాలకు సంబంధించిన సర్వే నిర్వహించి వివరాలను సేకరించారు. కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, న్యూఢిల్లీ, బీహార్ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు అనుష్క, అభిషేక్ జైన్, అలీష జెత్‌వానీ, హర్ష్ జా, ఆయుష్ కుమార్, భరత్ లాంబోర్, మండల వ్యవసాయ విస్తరణ అధికారి బాలకృష్ణ, గ్రామ రైతులు ఉన్నారు.

ప్రభుత్వ దవాఖానల్లో సాధారణ కాన్పులు జరిగేలా చూడాలి

జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ దామోదర్

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ దామోదర్

షాబాద్, జనవరి 18 : ప్రభుత్వ దవాఖానల్లో సాధారణ కాన్పులు జరిగేలా సిబ్బంది చర్యలు చేపట్టాలని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ దామోదర్ అన్నారు. గురువారం చేవెళ్ల డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయంలో డివిజన్‌కు సంబంధించిన ఆరోగ్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ దవాఖానల్లో గర్భిణుల వివరాల నమోదు, బాలింతల సంరక్షణ, పర్యవేక్షణ, శిశుపోషణ రక్షణ, సకాలంలో టీకాల నిర్వహణ ఫిర్యాదులు వస్తే ఇంటింటికీ సర్వే నిర్వహించి చర్యలు చేపట్టాలన్నారు. సాధారణ కాన్పులకు ప్రాధాన్యత ఇచ్చి ప్రభుత్వ దవాఖానల్లో కాన్పులు జరిగేలా చూడాలన్నారు. ప్రజలకు దగ్గు, జలుబు, జ్వరం, తల నొప్పి వంటి నొప్పులు కనిపిస్తే కరోనా పరీక్ష చేయడం, ఇతరత్రా విషయాలపై సిబ్బందికి సూచనలు అందించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సమావేశంలో సీహెచ్‌వోలు సంతోష, గోపాల్‌రెడ్డి, సుదర్శన్, బలరాం, ఆయా దవాఖానల వైద్యాధికారులు, ఫార్మసిస్ట్‌లు, సూపర్‌వైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, డేటా ఏంట్రీ ఆపరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన డివిజన్‌లోని దవాఖానల వైద్యసిబ్బంది

గంజాయి మొక్క పెంచుతున్న వ్యక్తి అరెస్ట్

శంకర్‌పల్లి, జనవరి 18 : గంజాయి మొక్కను పెంచుతున్న వ్యక్తిని శంకర్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. శంకర్‌పల్లి మండలం ఎల్వర్తి గ్రామంలో నివాసముంటున్న తలారి నందు తన ఇంటి ముందు నిషేధిత గంజాయి మొక్కను పెంచుతున్నాడు. పోలీసులకు అందిన సమాచారం మేరకు బుధవారం రాత్రి 2 గంటలకు గ్రామంలో నందు ఇంటికి చేరుకుని 700గ్రా. గంజాయి మొక్కను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

నగర పీసీ శ్రీనివాస్‌రెడ్డి

సిటీబ్యూరో, జనవరి 18 (నమస్తే తెలంగాణ) : విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే సహించబోమని, సిబ్బంది సమస్యలుంటే తనతో చెప్పుకోవాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ప్రజలకు పారదర్శకంగా, వేగంగా సేవలు అందించడంలో ప్రతి పోలీసు అధికారి ముందుండాలని సిబ్బందికి దిశా నిర్దేశం చేశారని హైదరాబాద్ పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు ఎన్.శంకర్‌రెడ్డి తెలిపారు. ఇటీవల పోలీసు అధికారుల సంఘం ఆధ్వర్యంలో పోలీస్ కమిషనర్‌ను కలిశారు. ఈ సందర్భంగా సీపీ సిబ్బంది సమస్యల పరిష్కారంతో పాటు సంక్షేమంపై దృష్టి పెడతామని, అలాగే సిబ్బంది ఎక్కడ కూడా విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని.. తమకు సూచించారని వెల్లడించారు. ఇటీవల నగర పోలీసులకు అత్యవసర సమయాల్లో అందుబాటులో ఉండేలా అంబులెన్స్ వాహనాన్ని కూడా సమకూర్చారని వివరించారు.

పలు రైళ్లు పునరుద్ధరణ

సిటీబ్యూరో, జనవరి 18 (నమస్తే తెలంగాణ) : రైల్వే నిర్వహణ వంటి పలు కారణాల వల్ల రద్దు చేసిన రైళ్లను తిరిగి పునరుద్ధరిస్తూ గురువారం రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నారు. దాండ్-నిజామాబాద్, నిజామాబాద్-పండాపూర్ స్టేషన్ల మధ్య రెండు రైళ్లను పాత టైమ్‌టేబుల్ ప్రకారం యథావిధిగా నడుపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ధర్మాబాద్-మన్మాడ్, పూరెంగాబాద్-హైదరాబాద్, నాగర్‌సోల్-నర్సాపూర్, ముంబయి సీఎస్ఎంటీ-నాందేడ్, నాందేడ్-పూనే, కాచిగూడ-నాగర్‌సోల్ స్టేషన్ల మధ్య నిలిచిపోయిన ఆరు రైళ్లను తిరిగి ఈ నెల 20 నుంచి షెడ్యూల్ ప్రకారం నడిపించనున్నామని అధికారులు పేర్కొన్నారు.

* సౌత్ వెస్టన్ రైల్వే జోన్‌కు సంబంధించి నాందేడ్-బెంగళూరు రైల్వే స్టేషన్ల మధ్య నడిచే రైలును యలహంకా-కేఎస్ఆర్ బెంగళూరు స్టేషన్ల మధ్య పాక్షికంగా రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు.

* న్యూఢిల్లీ- హైదరాబాద్ రైల్వే స్టేషన్ల మధ్య నడుస్తున్న రైలు ఈ నెల 20న రద్దు చేసినట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు.

21న మున్నూరుకాపు వివాహ పరిచయ వేదిక

కాచిగూడ, జనవరి 18 : మున్నూరు కాపు మహాసభ ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా ఉన్న మున్నూరుకాపు యువతి, యువకుల కోసం వివాహ పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ మున్నూరు కాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం మహాసభ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 (ఆదివారం) ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కాచిగూడలోని మ్యాడం అంజయ్య హాల్‌లో వివాహ పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత 35ఏండ్లుగా నిర్వహిస్తున్న ఈ వివాహ పరిచయ వేదికలో తెలంగాణలోని యువతి యువకులు పాల్గొని వివాహ సంబంధాలు పెంపొందించు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రి కొండ సురేఖ, విప్ ఆది శ్రీనివాస్, పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్, ధర్మపురి అరవింద్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, మాజీ మంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్యే దానం నరేందర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవీందర్, కె.లక్ష్మణ్, ట్రస్ట్ చైర్మన్ ఎం.ఆర్.వెంకట్రావ్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివాహ పరిచయ వేదిక చైర్మన్ గోపాల రాధాకృష్ణ, కన్వీనర్ కొమ్ము శ్రీనివాస్, లింగి శెట్టి హనుమంత్‌రావు, మణికొండ రమేశ్‌కుమార్, ప్రకాశ్, కొంతం సురేశ్ బాబు, కట్టెల సుభాష్, ప్రహ్లాద్, సదానంద్, శ్రీనివాస్‌రావు, జి.సత్యనారాయణ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు సీజ్

- ఎక్స్‌పైరీ డేట్ మందులు, గుర్తింపు పత్రాలు లేని ప్రథమ చికిత్స కేంద్రాలపై కొరడా
- నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు
- డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి

కొత్తూరు, జనవరి 18 : నిబంధనలు తుంగలో తొక్కి ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్న మూడు క్లినిక్‌లను సీజ్ చేశారు. ఈ సంఘటన కొత్తూరు మున్సిపాలిటీలో గురువారం జరిగింది. కొత్తూరు మున్సిపాలిటీలో ఇటీవల వైద్యం వికటించి ఓ మహిళ మృతి చెందడంతో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు రంగంలోకి దిగి నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ప్రైవేట్ క్లినిక్‌లపై కొరడా ఝుళిపించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి ఆధ్వర్యంలో ప్రైవేట్ క్లినిక్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదట సాయిబాబా క్లినిక్‌ను తనిఖీ చేసి మూడేండ్ల బాబుకు ఎక్స్‌పైరీ డేట్ మందులతో ఫ్లూయిడ్స్ ఎక్కిస్తుండగా పట్టుకున్నారు. నిబంధలనకు విరుద్ధంగా ఫార్మసీ నడుపుతుండడంతో దానిని సీజ్ చేశారు. అనంతరం జహంగీర్ ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌కు వ